సాక్షి
తూర్పుగోదావరి
సోమవారం । 11 । డిసెంబర్ । 2023



అన్నదాన భవనానికి రూ.లక్ష


ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి చోడపనీటి శ్రీనివాసరావు, మంగాదేవి దంపతులు (కొత్తపేట) ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



రూ.1,11,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి నామాల వీర వేంకట సత్యనారాయణ (మండపేట మండలం కేశవరం) ఆదివారం రూ.1,11,116 విరాళం సమర్పించారు.

కడలిలోకి 12,124 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 12,124 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. డెల్టా కాలువలకు నీటి విడుదలను పూర్తిగా నిలిపివేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదైంది.

తప్పులకు తావు లేకుండా..

- పొరపాట్లు లేకుండా ఓటర్ల జాబితా రూపకల్పనకు ముమ్మర కసరత్తు
- అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం
- జిల్లా వ్యాప్తంగా అవగాహన కల్పిస్తున్న అధికారులు
- కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు
- ఫారం 6, 7, 8 ద్వారా 2.96 లక్షల దరఖాస్తుల స్వీకరణ
- 2.50 లక్షల దరఖాస్తులకు తక్షణ పరిష్కారం
- మిగిలినవి 26 నాటికి పరిష్కరించేందుకు చర్యలు
- వచ్చే నెల 5 నాటికి సంపూర్ణ ఓటర్ల జాబితా



ఓటర్ల జాబితా రూపకల్పనపై సలహాలు ఇస్తున్న ఓటర్ల జాబితా పరిశీలకులు యువరాజ్, కలెక్టర్ మాధవీలత (ఫైల్)

సాక్షి, రాజమహేంద్రవరం: హేతుబద్ధత కలిగిన, తప్పులకు తావు లేని ఓటర్ల జాబితాను రూపొందించేందుకు అధికార యంత్రాంగం పటిష్ట ప్రణాళికతో చర్యలు తీసుకుంటోంది. ఓటర్ల తుది జాబితాకు రూపుదిద్దడంలో పారదర్శకతకు పెద్దపీట వేస్తోంది. ఇందులో రాజకీయ పార్టీలను భాగస్వాముల్ని చేస్తోంది. కియోస్క్‌లు ఏర్పాటు చేసి మరీ కొత్త ఓటర్లను నమోదు చేస్తోంది. జిల్లావ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఓటు విలువపై ప్రజల్లో ముఖ్యంగా యువతలో చైతన్యం కల్పిస్తోంది. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తోంది. వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనపై ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. వచ్చే నెల ఐదో తేదీ నాటికి సంపూర్ణ ఓటర్ల జాబితాను రూపొందించనుంది.

1,569 పోలింగ్ కేంద్రాల్లో ప్రక్రియ

జిల్లా వ్యాప్తంగా 1,569 పోలింగ్ కేంద్రాల పరిధిలో 15,76,026 మంది ఓటర్లు ఉన్నారు. ప్రజల నుంచి ఫారం 6, 7, 8లకు సంబంధించి 2,92,462 దరఖాస్తులను అధికార యంత్రాంగం స్వీకరించింది. వీటిలో ఇప్పటికే 2,50,096 పరిష్కరించగా, మిగిలిన 42,366 దరఖాస్తుల పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోంది. 18 ఏళ్ల వయసు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేసేందుకు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలు, వారి ఎపిక్ కార్డు సంఖ్యతో బేరీజు వేసుకుంటోంది. ఓటు లేని వారి నుంచి ఫారం–6 దరఖాస్తులు స్వీకరిస్తోంది. స్వీప్ తదితర కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తోంది. ఫలితంగా పెద్ద ఎత్తున కొత్త ఓటర్ల నమోదుకు ఎక్కువ దరఖాస్తులు అందుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలు ఇప్పటికే నిర్వహించారు. గత నెల 4, 5, ఈ నెల 2, 3 తేదీల్లో నిర్వహించిన ఈ ప్రత్యేక శిబిరాల్లో 31,748 దరఖాస్తులు వచ్చాయి.

పక్కాగా కసరత్తు

ముసాయిదా ఓటర్ల జాబితాపై అందిన దరఖాస్తులను ఈ నెల 26వ తేదీ నాటికి పూర్తి స్థాయిలో పరిష్కరించి, వచ్చే నెల 5న ఓటర్ల తుది జాబితా ప్రచురించే దిశగా అధికారులు పక్కా చర్యలు తీసుకుంటున్నారు. జాబితాలో చేర్పులు, మార్పులకు సంబంధించి ఆయా గ్రామ పంచాయతీలు, వార్డు సచివాలయల్లో నోటీసులు ఉంచుతున్నారు. క్షేత్ర స్థాయిలో బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓ), జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తున్నారు. ఎఫ్‌పీ రేషియో, జెండర్ రేషియో విషయంలో వాస్తవ పరిస్థితిని అంచనా వేస్తున్నారు. ఇందులో భాగంగా రేషన్ కార్డులో ఉన్న 18 ఏళ్లు నిండిన వారి వివరాలను, ఆ పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఓటర్ల సంఖ్యతో సరి చూసి, పక్కాగా జాబితా రూపొందించేందుకు ప్రయత్నిస్తున్నారు.

రాజకీయ నేతలతో సమావేశమవుతూ..

ఈ నెల 20వ తేదీ నాటికి పెండింగ్ దరఖాస్తులన్నింటినీ పరిష్కరించేందుకు కలెక్టర్ కె.మాధవీలత ప్రతి బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు. వారి సూచనలను పరిగణనలోకి తీసుకుంటూనే ఫారం 6, 7, 8 దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. యువ ఓటర్లు ఓటు హక్కు నమోదు చేసుకోవడం నుంచి ఓటు హక్కు వినియోగించుకునేంత వరకూ ఓటర్లలో చైతన్యం తీసుకురావడంలో రాజకీయ పార్టీలు కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ సూచిస్తున్నారు.

వెల్లువెత్తిన దరఖాస్తులు

ఓటు హక్కు నమోదు, మార్పులు, చేర్పులకు ఈ నెల 2, 3 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక శిబిరాల్లో జిల్లా వ్యాప్తంగా 17,924 దరఖాస్తులు అందాయి.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు



అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నదే ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ లక్ష్యం. అందుకు అనుగుణంగా ఓటర్ల జాబితా రూపకల్పనలో పారదర్శకత పాటిస్తున్నాం. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను దరఖాస్తుల రూపంలో స్వీకరించి, పరిష్కారానికి వేగంగా అడుగులు వేస్తున్నాం. ఓటు హక్కు నమోదుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రత్యేకంగా యువతకు అందుబాటులో ఉండేలా కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. జనవరి మొదటి వారంలో తుది జాబితా విడుదల చేయనున్న నేపథ్యంలో ఏ ఒక్కరూ తాను ఓటు హక్కు పొందలేదన్న భావన కలగకుండా చేసేందుకు కృషి చేస్తున్నాం.

– కె.మాధవీలత, జిల్లా కలెక్టర్

నియోజకవర్గం	ఫారం–6	ఫారం–7	ఫారం–8
అనపర్తి	1,623	286	327
రాజానగరం	1,261	147	724
రాజమహేంద్రవరం సిటీ	1,387	243	1,403
రాజమహేంద్రవరం రూరల్	2,575	248	1,343
కొవ్వూరు	1,246	151	548
నిడదవోలు	1,151	223	589
గోపాలపురం	1,911	336	202

న్యూస్‌రీల్

రత్నగిరి.. భక్తజనసంద్రం



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

అన్నవరం: రత్నగిరి ఆదివారం జనసంద్రమే అయ్యింది. తెల్లవారుజాము నుంచీ వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, దర్శనం క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. స్వామివారి ఆలయాన్ని తెల్లవారుజామున మూడు గంటలకు తెరచి సత్యదేవునికి పూజలు చేశారు. అనంతరం స్వామివారి దర్శనానికి భక్తులను అనుమతించారు. వ్రతాలు కూడా వేకువజామున మూడు గంటలకే ప్రారంభించారు. మధ్యాహ్నం రెండు గంటల వరకూ దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది. సత్యదేవుని ఉచిత దర్శనానికి గంట సమయం పట్టింది. భక్తుల రద్దీ దృష్ట్యా అంతరాలయ దర్శనాన్ని నిలిపివేశారు. అందరినీ వెలుపల నుంచే అనుమతించారు. యంత్రాలయంలో కూడా ప్రదక్షిణ దర్శనాలు నిలిపివేశారు. సుమారు 80 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి, పూజలు చేశారు. వ్రతాలు 8 వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.80 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. అన్నదాన పథకంలో 10 వేల మంది భక్తులకు భోజనం పెట్టారు. కార్తిక మాసం ఆఖరి సోమవారం కావడంతో రత్నగిరిపై నేడు కూడా భక్తుల రద్దీ కొనసాగనుంది. భక్తులు భారీగా తరలి వస్తారనే అంచనాతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తెల్లవారుజాము నుంచే సత్యదేవుని వ్రతాలు, దర్శనాలకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఆరు గంటల నుంచి రత్నగిరిపై అనివేటి మండపంలో సహస్ర జ్యోతిర్లింగార్చన నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు.

ఇప్పటి వరకూ 1.18 లక్షల వ్రతాలు

ప్రస్తుత కార్తిక మాసంలో ఇప్పటి వరకూ సత్యదేవుని వ్రతాలు 1.18 లక్షలు జరిగాయి. గత ఏడాది ఇదే రోజుకు 1,41,647 వ్రతాలు జరిగాయి. ఈ ఏడాది సుమారు 23 వేల వ్రతాలు తక్కువగా జరిగాయి. మంగళవారంతో కార్తిక మాసం ముగియనుంది.

రద్దీగా కోటసత్తెమ్మ తల్లి సన్నిధి

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేలాదిగా వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధానార్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా అమ్మవారికి రూ.75,100 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ) తెలిపారు.

శ్రీపీఠం.. అరుణారుణం

- 103 కోట్లకు చేరిన కుంకుమార్చనలు
- మహాశక్తి యాగం విజయవంతం



లలితా సహస్ర నామార్చన చేయిస్తున్న పరిపూర్ణానంద స్వామి

కాకినాడ రూరల్: పవిత్ర కార్తిక మాసంలో కాకినాడ రమణయ్యపేటలోని శ్రీపీఠం అరుణారుణ కాంతులను అద్దుకుంది. దేశంలోనే మొట్టమొదటిసారిగా ఒకే వేదికపై వేలాది మంది మహిళలు లలితా సహస్ర నామాలతో చేసిన శతకోటి కుంకుమార్చనలు.. పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామి పట్టుదల, దీక్షతో సంపూర్ణమయ్యాయి. వంద కోట్ల లలితా కుంకుమార్చనలు విజయవంతంగా జరగడమే కాదు.. ఏకంగా 103 కోట్లు పూర్తయ్యాయి. మహాశక్తి యాగంలో 27వ రోజైన ఆదివారం ఈ అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. గత నెల 14న కార్తిక మాసం తొలి రోజున ఇక్కడ ఈ మహాశక్తి యాగం ప్రారంభమైంది. ప్రతి రోజూ నక్షత్ర శాంతి పూజలు, లలితా సహస్ర నామాలతో కుంకుమార్చనలు, సాయంత్రం కోటి దీపోత్సవం, రాత్రి బగళాముఖి హోమం, రుద్ర యాగం నిర్వహించారు. ఈ మహత్తర మహాశక్తి యాగం బుధవారం పరిసమాప్తి కానుంది. అకాల మృత్యు నివారణకు, ప్రజలు సుభిక్షంగా ఉండేందుకు ఈ యాగం తలపెట్టానని పరిపూర్ణానంద స్వామి చెప్పారు. ప్రతి ఒక్కరూ లలితా అమ్మవారిపై భారం వేసి, జీవితాన్ని పండించుకోవాలని సూచించారు. అమ్మ అనే అనుభూతిని పొందుతూ ప్రతి రోజూ 24 నిమిషాలు అమ్మవారికి కేటాయించి, లలితా సహస్ర నామాలు పఠించాలని చెప్పారు.

పంచారామ క్షేత్రం కిటకిట



కుమారారామ భీమేశ్వరస్వామికి తొలి అభిషేకం చేస్తున్న అర్చకులు

సామర్లకోట: కార్తిక మాసం చివరి ఆదివారం కావడంతో పంచారామ క్షేత్రానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కుమారారామ భీమేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరీదేవి అమ్మవారిని దర్శించుకోవడానికి తెల్లవారుజాము నుంచీ బారులు తీరారు. ధ్వజస్తంభం, రావి, జమ్మి, మారేడు చెట్లు, తులసి మొక్కల వద్ద కార్తిక దీపాలు వెలిగించారు. ఈఓ టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యాన వేకువన గోపూజతో స్వామివారికి అభిషేకాలు, పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ ఆలయ అర్చకులు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానానికి రూ.2,500 చెల్లించిన భక్తులు లక్షపత్రి పూజలు చేసుకున్నారు. మధ్యాహ్నం దేవస్థానం తరఫున భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. గత నెల 14న ప్రారంభమైన కార్తిక మాసోత్సవాలు ఈ నెల 13తో ముగియనున్నాయి. ఈ సందర్భంగా దీపారాధన సంఘ సభ్యుల ఆధ్వర్యాన 12వ తేదీ మధ్యాహ్నం భారీగా అన్నదానం చేయనున్నారు. రాత్రి కోటి దీపోత్సవం నిర్వహిస్తారు. 13వ తేదీ మధ్యాహ్నం స్వామి వారికి వెండి ఆభరణాలతో జటాజూటం అలంకరణతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ అలంకరణను తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

అంతర్వేది.. భక్తజన పెన్నిధి



అంతర్వేది ఆలయంలో భక్తజన సందోహం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. కార్తిక మాసం ఆదివారం సెలవు దినం కావడంతో స్వామివారి దర్శనానికి పలువురు కుటుంబ సమేతంగా వచ్చారు. అలాగే అయ్యప్ప, భవానీ దీక్షాధారులు రావడంలో ఆలయం కిక్కిరిసింది. సుదర్శన హోమంలో అధిక సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు. సుమారు 15 వేల మంది భక్తులు వచ్చినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. భక్తులకు తాగునీరు అందించడంతో పాటు నిత్యాన్నదాన పథకంలో భోజన వసతి కల్పించారు.

కిక్కిరిసిన అయినవిల్లి క్షేత్రం

అయినవిల్లి: విఘ్నేశ్వరుని క్షేత్రం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. పంచామృత, ప్రత్యేక అభిషేకాల్లో 158 మంది, స్వామివారి ప్రత్యేక దర్శనంలో 1,269 మంది, శ్రీలక్ష్మీ గణపతి హోమంలో 37 మంది భక్తులు పాల్గొని పూజలు చేశారు. అలాగే నూతన వాహన పూజలు, చిన్నారులకు నామకరణలు, అక్షరాభ్యాసాలు, నామకరణలు జరిగాయి. స్వామి వారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాల ద్వారా రూ.3,17,793 ఆదాయం సమకూరింది.

బలమైన ఆర్థిక శక్తిగా భారత్

- 2047 నాటికి తీర్చిదిద్దడమే మోదీ లక్ష్యం
- కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా
- దోసకాయలపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



ప్రతిజ్ఞ చేయిస్తున్న కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా. చిత్రంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, కలెక్టర్, జేసీ, పురంధేశ్వరి

మధురపూడి: భారత్‌ను 2047 నాటికి ప్రపంచంలోనే బలమైన ఆర్థిక శక్తిగా నిలిపేందుకు నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని కేంద్ర, పౌర విమానయానం, ఉక్కు శాఖల మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. కోరుకొండ మండలం దోసకాయలపల్లి హైస్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వికసిత్ భారత్ కోసం అందరం కలసి అడుగులు వేద్దామని పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక విధానాలను ప్రభుత్వం అమలు చేస్తోందని, ఇందులో భాగంగానే డ్రోన్ వ్యవసాయం తీసుకువచ్చిందని తెలిపారు. డ్రోన్ అక్కా పథకం కింద 17 వేల మంది మహిళలకు డ్రోన్ల ద్వారా విత్తనాలు విత్తడం, ఎరువులు వెదజల్లడం తదితర పనుల్లో శిక్షణ ఇచ్చామన్నారు. 80 శాతం సబ్సిడీతో కేంద్ర ప్రభుత్వం డ్రోన్లు అందిస్తోందని చెప్పారు. పీఎం గరీబ్ కల్యాణ్, పీఎం ఉజ్వల్ యోజన వంటి పథకాలు పేదలకు ఉపయోగపడుతున్నాయన్నారు. దేశవ్యాప్తంగా 9.50 కోట్ల మంది మహిళలకు పీఎం ఉజ్వల్ యోజన పథకం కింద గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామని తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరందించే కార్యక్రమం జరుగుతోందని, దేశంలో 37 కోట్ల మందికి ప్రధానమంత్రి ఆయుష్మాన్ కార్డులు అందించామని వివరించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన అనంతరం, భారత్‌ను వికసిత్ దేశంగా అభివృద్ధి చేసేందుకు కలసి అడుగులు వేద్దామంటూ మంత్రి సింధియా ప్రతిజ్ఞ చేయించారు.

రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి – సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలను అందిస్తోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం మరింతగా జోడించి వలంటీర్ల ద్వారా అర్హులందరికీ సమర్థవంతంగా సంక్షేమం అందిస్తోందని తెలిపారు.

కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర పథకాలను అర్హులైన అందరికీ అందించడం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఉద్దేశమని చెప్పారు. తొలుత డ్రోన్‌ను ప్రారంభించారు. కేంద్ర మంత్రి సింధియాకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్‌లు వినాయకుని ప్రతిమను బహూకరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి, ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, ఆర్‌డీఓ చైత్రవర్షిణి, వివిధ శాఖల జిల్లా అధికారులు జానా సత్యనారాయణ, ఎస్.మాధవరావు, గోవింద్, జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కంటే వినయ్‌తేజ, ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్, తహసీల్దార్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

నగదు రహితం

- స్త్రీనిధిలో నగదు రహిత చెల్లింపులకు శ్రీకారం
- డిజిటల్ పేమెంట్లతో అక్రమాల నివారణ
- ఫలితమిస్తున్న కొత్త విధానం
- రెండు నెలల్లో రూ.1.20 కోట్ల మేర నగదు రహిత రికవరీలు



సమావేశం నిర్వహించుకుంటున్న స్వయం సహాయక సంఘాల మహిళలు (ఫైల్)

కాకినాడ సిటీ: మహిళల జీవనోపాధుల అభివృద్ధిలో స్త్రీనిధి కీలకపాత్ర పోషిస్తోంది. స్త్రీనిధి క్రెడిట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ ద్వారా రుణాలు పొందిన మహిళలు వందలాది మంది పేదరికం నుంచి గట్టెక్కారు. అయితే స్త్రీనిధి కింద తీసుకున్న రుణాలను రికవరీ చేస్తున్నప్పటికీ కొంత మంది సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఈ కారణంగా నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) పెరిగిపోతున్నాయి. కొన్ని మండలాల్లో కొత్త రుణాల పంపిణీకి అవకాశం కూడా లేకుండా పోతోంది. ఈ నేపథ్యంలో స్త్రీనిధిలో అక్రమాలకు పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఇప్పటికే పేటీఎం యంత్రాలను కూడా సరఫరా చేసింది.

పలు మండలాల్లో సిబ్బంది చేతివాటం

జిల్లా నుంచి వలసలు ఎక్కువగా ఉంటూండటంతో వాటిని అరికట్టేందుకు, ప్రభుత్వం స్త్రీనిధి కింద తక్కువ వడ్డీతో మహిళలకు రుణ సదుపాయం కల్పించి, వివిధ వృత్తుల్లో స్వయం ఉపాధి పొందేలా చర్యలు తీసుకుంది. అయితే స్వయం సహాయక సంఘాల మహిళలు స్త్రీనిధి నుంచి తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించే క్రమంలో కొంతమంది సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారు. రికవరీ మొత్తాన్ని ఆయా మహిళలు ప్రతి నెలా గ్రామైక్య సంఘానికి నగదు రూపంలో చెల్లిస్తున్నారు. ఈ మొత్తాన్ని గ్రామైక్య సంఘం ఖాతాలో వేసుకుని, దాని నుంచి స్త్రీనిధి ఖాతాకు బదిలీ చేస్తున్నారు. అయితే మహిళలు చెల్లిస్తున్న మొతాన్ని కొంత మంది సిబ్బంది స్వాహా చేస్తున్నారు. దీంతో జిల్లాలోని అనేక మండలాల్లో స్త్రీనిధి బకాయిలు పెద్ద మొత్తంలో పేరుకుపోయాయి. ఒక మండలంలో బకాయి రూ.20 లక్షలకు మించితే ఆ మండలానికి రుణాలు నిలిపివేస్తారు.

అక్రమాలను నిరోధించేందుకే..

స్త్రీనిధి రుణాలు తీసుకున్న మహిళలు వాటిని తిరిగి చెల్లిస్తున్నప్పటికీ, కొంతమంది సిబ్బంది చేతివాటం చూపుతూండటంతో.. దీనికి కళ్లెం వేసేందుకు ప్రభుత్వం నగదు రహిత లావాదేవీలకు శ్రీకారం చుట్టింది. డీఆర్‌డీఏ – వైఎస్సార్ క్రాంతి పథం(వైకేపీ)కి సంబంధించి జిల్లాలో తుని, జగ్గంపేట, పెద్దాపురం, తాళ్లరేవు క్లస్టర్లు ఉన్నాయి. మొదట ప్రతి క్లస్టర్‌లోని రెండేసి మండలాల్లో డిజిటల్ చెల్లింపులకు గత అక్టోబర్ 20న శ్రీకారం చుట్టారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యాన నగదు రహిత లావాదేవీలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటి వరకూ నగదు రహిత లావాదేవీల ద్వారా దాదాపు రూ.1.20 కోట్ల మేర రికవరీ చేశామని స్త్రీనిధి అధికారులు చెబుతున్నారు. పేటీఎం మెషీన్‌లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, ఫోన్ పే, గూగుల్ పే చేయవచ్చు. డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డులు స్వైపింగ్ చేసి కూడా రికవరీ చేయవచ్చు. తద్వారా ఆ సొమ్ములు నేరుగా స్త్రీనిధి ఖాతాకు జమవుతున్నాయి.

ఇక నుంచి రుణాలూ వ్యక్తిగత ఖాతాలకే..

స్వయం సహాయక సంఘాల్లో పది మంది మహిళలుంటారు. గ్రూపు మొత్తానికి రూ.5 లక్షల వరకూ, వ్యక్తిగతంగా అయితే రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకూ తక్కువ వడ్డీతో రుణం పొందవచ్చు. స్త్రీనిధి నుంచి తీసుకుంటున్న వ్యక్తిగత రుణం కూడా ఇప్పటి వరకూ గ్రూపు ఖాతాకే జమవుతోంది. ఈ మొత్తాన్ని ఆయా గ్రూపు లీడర్లు బ్యాంకు నుంచి డ్రా చేసి సంబంధిత మహిళలకు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఇలా బ్యాంకు నుంచి డ్రా చేసి ఇవ్వడానికి కొంతమంది ముడుపులు ఆశిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. దీంతో, ఇకపై స్త్రీనిధి నుంచి తీసుకునే వ్యక్తిగత రుణాలను కూడా నేరుగా పొదుపు మహిళల వ్యక్తిగత ఖాతాలకే జమ చేయాలని నిర్ణయించారు. దీనివలన రుణాల మంజూరులో కూడా పారదర్శకత పెరుగుతుంది.

రూ.450 కోట్ల రుణాలు

స్త్రీనిధి క్రెడిట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ ద్వారా పొదుపు మహిళల జీవనోపాధుల అభివృద్ధికి 2019–20 నుంచి రుణాల పంపిణీ ముమ్మరం చేశారు. ఇప్పటి వరకూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రూ.450 కోట్ల మేర రుణాలు పంపిణీ చేశారు. దాదాపు ఐదేళ్లలో 85,745 మంది మహిళలు ఈ రుణాలతో పలు వృత్తులను అభివృద్ధి చేసుకున్నారు. కొన్ని మండలాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో రికవరీ బాగానే ఉందని అధికారులు చెబుతున్నారు.

పేటీఎం ద్వారానే రికవరీలు



గ్రామ సంఘానికి పొదుపు మహిళలు నగదు రూపంలో చెల్లించిన మొత్తం కొన్ని ప్రాంతాల్లో స్త్రీనిధి ఖాతాకు జమ కావడం లేదు. ఈ నేపథ్యంలో సెర్ప్ నగదు రహిత లావాదేవీలు ప్రవేశపెట్టింది. ఇప్పటి వరకూ నగదు రహితంగా రూ.1.20 కోట్ల మేర నేరుగా స్త్రీనిధి ఖాతాకు జమయ్యింది.

– కె.శ్రీరమణి, ప్రాజెక్ట్ డైరెక్టర్, డీఆర్‌డీఏ, కాకినాడ జిల్లా

చురుకుగా రికవరీ



స్త్రీనిధి రుణ వాయిదాల చెల్లింపులో మరింత పారదర్శకత, క్షేత్ర స్థాయి సిబ్బందిలో జవాబుదారీతనాన్ని తీసుకువచ్చేందుకు సెర్ప్ పేటీఎం విధానాన్ని ప్రవేశపెట్టింది. దీంతో రికవరీలు చురుకుగా జరుగుతున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో స్త్రీనిధి రికవరీలు అనుకున్న లక్ష్యం దిశగా సాగుతోంది.

– ధర్మేంద్ర, స్త్రీనిధి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్, తూర్పు గోదావరి జిల్లా

క్లుప్తంగా

వెంబడించి దాడి చేసిన నిందితుల అరెస్ట్

- డ్రైవర్‌పై దాడి కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వర్మ

నిడదవోలు: నిడదవోలు గణపతి సెంటర్‌లో శనివారం ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి జరిపిన కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. దీనికి సంబంధించిన వివరాలను ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎస్ఎన్ వర్మ వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి శనివారం ఆర్టీసీ బస్సు తాడేపల్లిగూడెం బయలు దేరింది. అక్కడి షెల్టాన్ హోటల్ సెంటర్‌లో బస్సుకు అడ్డుగా మోటార్ సైకిల్ ఉండటంతో ఆర్టీసీ డ్రైవర్ గూడపల్లి ధనశంకర నాగరాజు మోటార్ సైకిల్‌పై ఉన్న వ్యక్తిని మందలించారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో మోటార్‌సైకిల్‌పై ఉన్న వ్యక్తి తన బంధువులతో కారులో ఆర్టీసీ బస్సును వెంబడించారు. ఆర్టీసీ బస్సు నిడదవోలు పట్టణంలో గణపతి సెంటర్‌కు వచ్చేసరికి కారును బస్సుకు అడ్డంగా నిలిపారు. వెంటనే వారు కారు దిగి ఆర్టీసీ ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేశారు. డ్రైవర్ ధన శంకర్ నాగరాజును కిందకు లాగి వారు తెచ్చుకున్న మారణాయుధాలు, ఇనుప రాడ్డుతో దాడి చేసి హత్యాయత్నం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. ఈ మేరకు నిందితులు రాజమహేంద్రవరం కొత్తపేటకు చెందిన సువ్వాడ గోవిందరాజు, సువ్వాడ భార్గవ రామకృష్ణసాయి, సువ్వాడ జశ్వంత్‌కార్తిక్, అన్నపూర్ణమ్మపేటకు చెందిన మజ్జి బాలదుర్గ ప్రవీణ్‌లను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావు, పట్టణ ఎస్సై పి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కిరాణా షాపు దగ్ధం

పెద్దాపురం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కాండ్రకోటలో ఓ కిరాణా షాపు దగ్ధమైనట్లు పెద్దాపురం అగ్నిమాపకాధికారి శ్రీహరి జగన్నాథం తెలిపారు. ఈ మేరకు శనివారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన పోబోలు సత్యకృష్ణకు చెందిన షాపు కాలిపోయిందన్నారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశామన్నారు. సుమారు రూ.రెండు లక్షల మేర ఆస్తినష్టం సంభవించిందన్నారు. ఆదివారం ప్రమాద బాధితులను ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, సొసైటీ అధ్యక్షుడు పల్ల గంగారావు, ఉప సర్పంచ్ జోకా నానాజీ పరామర్శించారు. విద్యుత్ శాఖాధికారులతో ఫోన్‌లో మాట్లాడి బాధిత కుటుంబానికి సహకారం అందించాలని దొరబాబు తెలిపారు.

ప్రజ్ఞ పెంచేలా.. ప్రతిభ చాటేలా..

SAKSHI SPELL Bee 2023-24

SAKSHI MATH BEE 2023-24

- ఉత్సాహంగా 'సాక్షి' స్పెల్‌బీ క్వార్టర్ ఫైనల్స్, మ్యాథ్‌బీ సెమీ ఫైనల్స్
- ఉమ్మడి జిల్లా నుంచి వెయ్యి మంది విద్యార్థుల హాజరు
- నాలుగు కేటగిరీల్లో పరీక్షల నిర్వహణ ఎంతో ఉపయుక్తం అంటున్న తల్లిదండ్రులు

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థులను ఆంగ్ల భాషలో పరిజ్ఞానవంతులుగా, గణితంలో ప్రజ్ఞావంతులుగా తీర్చిదిద్దేందుకు 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన 'సాక్షి' స్పెల్‌బీ క్వార్టర్ ఫైనల్స్, 'సాక్షి' మ్యాథ్‌బీ సెమీ ఫైనల్స్ ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. రాజమహేంద్రవరం త్రిపురనగర్‌లోని ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్లో నిర్వహించిన ఈ పరీక్షలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో స్పెల్‌బీ, మ్యాథ్‌బీ పరీక్ష రాయించేందుకు అమితాసక్తి చూపారు. 'సాక్షి' స్పెల్‌బీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నాలుగు కేటగిరీలుగా పరీక్షలు నిర్వహించగా, మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు 'సాక్షి' మ్యాథ్‌బీ నాలుగు కేటగిరీల్లో నిర్వహించారు. మొత్తం వెయ్యి మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు. కేటగిరీ–1లో 1, 2 తరగతులు విద్యార్థులకు, కేటగిరీ–2లో 3, 4 తరగతులకు, కేటగిరీ–3లో 5, 6, 7 తరగతులకు, కేటగిరీ–4లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. 'సాక్షి' స్పెల్‌బీ, 'సాక్షి' మ్యాథ్‌బీ వంటి పరీక్షలు విద్యార్థుల్లో నూతనోత్సాహాన్ని నింపుతాయని, వారిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడానికి, కాంపిటేటివ్ పరీక్షలకు ఎంతో దోహదపడతాయని తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఈ స్పెల్‌బీ, మ్యాథ్‌బీ నిర్వహించిన 'సాక్షి' యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరీక్షలను ట్రిప్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ బాలా త్రిపురసుందరి, 'సాక్షి' రీజినల్ మేనేజర్ (అడ్మిన్) ఎస్.రమేష్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ (మార్కెటింగ్) కె.ఉమాశంకర్‌లు పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. మెయిన్ స్పాన్సర్‌గా డ్యూక్స్‌వేఫీస్, అసోసియేట్ స్పాన్సరర్‌గా రాజమహేంద్రవరం ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరించాయి.



ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్లో 'సాక్షి' స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థినీ విద్యార్థులు

ప్రోత్సహించడం అభినందనీయం



విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని 'సాక్షి' స్పెల్‌బీ నిర్వహించడం అభినందనీయం. నార్మల్ స్టడీస్‌తో పాటు నేర్చుకోవడం ఈజీ కాదు. 'సాక్షి' యాజమాన్యం స్పెల్‌బీ పరీక్ష రాయించి విద్యార్థులను ప్రోత్సహించడం బాగుంది.

–ఎస్‌వీ సురేష్, ఆదిత్య స్కూల్ (శ్రీనగర్) విద్యార్థి తండ్రి, కాకినాడ

కొత్త విషయాలు తెలుసుకున్నా..



'సాక్షి' స్పెల్‌బీ పరీక్ష రాయడంతో నేను సరికొత్త విషయాలను తెలుసుకున్నాను. స్పెల్లింగ్స్‌తో పాటు, ఇంగ్లిషు భాషపై పూర్తి పట్టు సాధించగలిగాను. ఇటువంటి పరీక్షలు 'సాక్షి' యాజమాన్యం పెడుతుంటే విద్యార్థులకు సబ్జెక్టుపై మరింత పట్టు పెరుగుతుంది.

–అమృతవర్షిణి, 10వ తరగతి, ఆదిత్య స్కూల్, అమలాపురం

విదేశీ విద్యకు ఎంతో ఉపయోగం



విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులకు 'సాక్షి' స్పెల్‌బీ ఎంతగానో ఉపయోగపడుతుంది. కొత్త పదాలు నేర్చుకోవడంతో పాటు కాన్ఫిడెన్స్ పెరుగుతుంది. ఇంగ్లిషు భాషపై పట్టు సాధించవచ్చు.

–అరవ్‌కృష్ణ గూడూరు, 9వ తరగతి, ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్, రాజమహేంద్రవరం

గణితంపై భయం ఉండదు



గణితం అంటే విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు 'సాక్షి' మ్యాథ్‌బీ దోహదపడింది. ఈ పరీక్షలు పైతరగతులకు ఎంతగానో ఉపయోగపడతాయి. మ్యాథ్‌బీ గణితంపై పట్టు సాధించేందుకు దోహదం చేస్తుంది.

–షర్లీ, నాల్గో తరగతి, ప్రతిభ స్కూల్, రాజమహేంద్రవరం

ఆంగ్లం, గణితంపై పట్టు సాధించవచ్చు



ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆంగ్ల భాష ప్రాధాన్యం పెరిగింది. ఈ క్రమంలో ఇటువంటి స్పెల్‌బీ, మ్యాథ్‌బీ పరీక్షలు ఎంతో ఉపయోగకరం. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచి ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు ఈ పరీక్ష దోహదపడుతుంది. ఆంగ్లంలో మరింత పరిణితి సాధించడానికి వీలుంటుంది. 'సాక్షి' మ్యాథ్‌బీ పరీక్ష ద్వారా విద్యార్థులు రీజనింగ్‌లో ప్రతిభ కనబరుస్తున్నారు. గణితంలో వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. గణితంపై విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతుంది.

–బాలా త్రిపురసుందరి, డైరెక్టర్, ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్, రాజమహేంద్రవరం

చాలా ఇంప్రూవ్ అయ్యింది



'సాక్షి' స్పెల్‌బీ పరీక్ష ద్వారా మా అమ్మాయి చాలా ఇంప్రూవ్ అయ్యింది. ఈ పరీక్ష రాయడం ద్వారా ఆంగ్ల భాషపై పూర్తి పట్టు వస్తుంది. దీంతో ఉన్నత చదువులకు బాట పడుతుంది. మా చిన్నతనంలో మాకు ఇటువంటి అవకాశాలు లేవు. ఇప్పుడు 'సాక్షి' యాజమాన్యం స్పెల్‌బీ, మ్యాథ్‌బీ నిర్వహించడం అభినందనీయం.

–బి.నివేదిత, శ్రీగౌతమీ స్కూల్ విద్యార్థిని తల్లి, రాజమహేంద్రవరం

ఇంగ్లిషులో ప్రావీణ్యం సాధించేందుకు..



'సాక్షి' స్పెల్‌బీ రాయడం ద్వారా ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం సాధించేందుకు అవకాశం ఏర్పడింది. కొత్తగా పదాలు తెలుసుకోవడంతో పాటు, సెంటన్స్ ఫార్మేషన్‌కు ఉపయోగపడింది. ప్రభుత్వ పాఠశాల నుంచి 'సాక్షి' స్పెల్‌బీ పరీక్ష తొలిసారిగా రాయడం చాలా ఆనందంగా ఉంది.

–ఎస్.నవదీప్, ఏపీ మోడల్ స్కూల్, శంఖవరం

కరాటేకు పెరుగుతున్న ఆదరణ

సామర్లకోట: కరాటేకు రోజు రోజుకూ ఆదరణ పెరుగుతుందని కరాటే అసోసియేషన్ ఇండియా చీఫ్, తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి కె.మల్లికార్జున గౌడ్, లయన్స్ క్లబ్ మొదటి జిల్లా గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్, భారతమాత సేవా పరిషత్తు అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్య దొర అన్నారు. సామర్లకోట డీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో ఆదివారం జాతీయ స్థాయి కరాటే పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామర్లకోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పదేళ్లుగా కరాటే పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు చిత్తూలూరి వీర్రాజు మాట్లాడుతూ పోటీల్లో తొమ్మిది రాష్ట్రాలు తలపడ్డాయన్నారు. ఈ పోటీల్లో ఓవరాల్ చాంపియన్లుగా ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటకలు నిలిచాయి. ద్వితీయ స్థానాన్ని ఆంధ్ర, తృతీయ స్థానాన్ని కర్ణాటక కైవసం చేసుకున్నాయి. వ్యక్తిగత చాంపియన్ బాలికల విభాగంలో తెలంగాణ, పురుషుల విభాగంలో ఆంధ్రప్రదేశ్ కైవసం చేసుకున్నాయి. విజేతలకు ఈదల ఈశ్వరకుమార్, మల్లికార్జునరావు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కరాటే కోచ్ డి.శంకరరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ చిత్తూలూరి శ్రీదేవి, జోన్ చైర్మన్ మద్దిరాల శివనాగకృష్ణ, స్థానిక క్లబ్ చైర్మన్ కానుబోయిన విజయకృష్ణ, కార్యదర్శి కె.ప్రసాద్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న మల్లికార్జున్‌గౌడ్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో 'తూర్పు' క్రీడాకారుల ప్రతిభ

26 స్వర్ణ, 19 రజత, 25 కాంస్య పతకాలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): తిరుపతిలో ఈ నెల 8 నుంచి 10 వరకూ జరిగిన రాష్ట్ర స్థాయి 42వ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. 30 నుంచి 85 ఏళ్ల వయసు పురుషులు, మహిళల విభాగంలో రన్స్, త్రోస్, జంప్స్ పోటీలు నిర్వహించగా జిల్లా క్రీడాకారులు 26 బంగారు, 19 రజత, 25 కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. రాష్ట్ర స్థాయి మార్చ్‌ఫాస్ట్ విభాగంలో తృతీయ స్థానం పొందారు. ఈ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను సంఘ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, కార్యదర్శి ఎం.బాపిరాజు, ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కార్యదర్శి జి.ఎలీషాబాబు, ఒలింపిక్ సంఘ ఉపాధ్యక్షుడు చంద్రు గోవిందరాజు, ఒలింపిక్ సంఘ సీఓఓ ఎం.మురళీధర్, పీవీ కృష్ణారావు అభినందించారు. ఈ సందర్భంగా ద్వారంపూడి వీరభద్రారెడ్డి మాట్లాడుతూ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించడం గర్వకారణం అన్నారు. యువ క్రీడాకారులు వీరిని స్ఫూర్తిగా తీసుకుని రాణించాలన్నారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బి.కృష్ణమూర్తి, బాపిరాజులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.



మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో పతకాలు సాధించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీడాకారులు

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

నిడదవోలు: స్థానిక రైల్వేస్టేషన్ సెంటర్‌లోని ఎస్ఆర్ లాడ్జిలో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా మేడ్చల్‌కు చెందిన పొన్నాడ భరణీకుమార్ (33) ఈ నెల 9న మధ్యాహ్నం లాడ్జిలో దిగాడు. ఆదివారం తెల్లవారుజామున అతను ఉన్న గదికి గడియ పెట్టి ఉండటంతో అనుమానం వచ్చి లాడ్జి సిబ్బంది చూసేసరికి ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకుని ఉండటం గమనించారు. లాడ్జి నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇవ్వగా పట్టణ ఎస్సై పి.నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు భరణీకుమార్ అత్తారిల్లు నిడదవోలు పట్టణంగా గుర్తించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఎస్సై పి.నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


అథ్లెటిక్స్‌కు విద్యార్థుల ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జేఎన్టీయూ క్రీడా మైదానంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలను అథ్లెటిక్స్ సంఘ అధ్యక్షుడు టీవీఎస్ రంగారావు, డీఎస్డీఓ శ్రీనివాస్ కుమార్ ప్రారంభించారు. అండర్–14, 16 విభాగాల్లో బాలురు, బాలికలకు 10, 8, 6, 2 కిలోమీటర్ల పరుగు పందెం నిర్వహించారు. ఈ ఎంపికలకు 250 మంది హాజరుకాగా 30 మందిని క్రాస్‌కంట్రీ పోటీలకు ఎంపిక చేశామని సంఘ కార్యదర్శి సుబ్రహ్మణ్యం తెలిపారు. అదేవిధంగా నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీలకు 13 మంది ఎంపికయ్యారన్నారు. ఈ ఎంపికల నిర్వహణలో పీడీలు బంగార్రాజు, నూకరాజు, గోవిందు, గిరి తదితరులు పాల్గొన్నారు.



క్రాస్‌కంట్రీ పోటీలకు ఎంపికైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీడాకారులు

నువ్వా నేనా అనేట్టు..



వెయిట్ లిఫ్టింగ్ చేస్తున్న క్రీడాకారిణి



మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలతో నన్నయ వీసీ ఆచార్య పద్మరాజు


- ఉత్కంఠగా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు
- వేదికగా మారిన 'నన్నయ' వర్సిటీ

రాజానగరం: వెయిట్ లిఫ్టింగ్ అంటే ముందుగా గుర్తొచ్చేది మహిళల్లో కరణం మల్లేశ్వరి, పురుషుల్లో కోడి రామ్మూర్తి. వారు తమ ప్రతిభతో ఈ క్రీడలో చెరగని, చెదరని ముద్ర వేశారు. ప్రస్తుతం ఆదికవి నన్నయ యూనివర్సిటీలో మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియంలో ఎంతో మంది వారిని స్ఫూర్తిగా తీసుకుని సత్తా చాటాలని పోటీ పడుతున్నారు. ఇక్కడ రెండు రోజులుగా సౌత్ అండ్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ మెన్ అండ్ ఉమెన్ చాంపియన్ షిప్ 2023–24 పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. నాలుగు రోజుల పాటు (12 వరకు) జరిగే ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కేరళ, గుజరాత్, రాజస్థాన్, గోవా, పుదుచ్చేరి రాష్ట్రాలలోని 90 యూనివర్సిటీల నుంచి సుమారు 800 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వారు నువ్వా నేనా అనేలా సత్తా చాటుతూ పతకాలు కైవసం చేసుకుంటున్నారు. మహిళలు, పురుషులకు 20 కేటగిరీలలో ఈ పోటీలు జరుగుతున్నాయి. ఇప్పటికే 10 కేటగిరీలు పూర్తయ్యాయి.

10 కేటగిరీల్లో విజేతలు వీరే..

రెండో రోజైన ఆదివారానికి పది కేటగిరీలలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు పూర్తయ్యాయి. ఇందులో విజేతలకు నన్నయ వీసీ ఆచార్య కె.పద్మరాజు మెడల్స్, సర్టిఫికెట్లు బహూకరించారు. పురుషుల 55 కిలోల విభాగంలో ఆకాష్ శ్రీనివాస్ (నాందేడ్ యూనివర్సిటీ, మహారాష్ట్ర), ఇ.కోటేశ్వరరావు (ఆదికవి నన్నయ యూనివర్సిటీ), పి.బాలాజీ (తిరువళ్లూరు యూనివర్సిటీ)లకు బంగారు, వెండి, కాంస్య పతకాలు వచ్చాయి. 61 కిలోల విభాగంలో రుతేశ్వర్ (తిరువళ్లూర్ యూనివర్సిటీ), సుబ్రహ్మణ్యం (మంగుళూరు యూనివర్సిటీ), ఎస్.అబ్దుల్ (రాయలసీమ యూనివర్సిటీ), 67 కిలోల విభాగంలో శ్యామ్ సుందర్‌రాజు (అన్నా యూనివర్సిటీ), పాండురంగ్ గైక్వాడ్ (భారతీయ విద్యా పీఠల్), సి.దినేష్ (యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్)లు మొదటి మూడు స్థానాలను నిలిచారు. 45 కిలోల మహిళల విభాగంలో బి.రాజేశ్వరి (ఆదికవి నన్నయ యూనివర్సిటీ), దోనే ఆపేక్ష దత్తరి (శివాజీ యూనివర్సిటీ, కొల్హాపూర్), పూనే హర్షద (సావిత్రీబాయ్ పూలే యూనివర్సిటీ, పూణే) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారు. 49 కిలోల విభాగంలో టి.అరతి రాఘవేంద్ర (శివాజీ యూనివర్సిటీ, కొల్హాపూర్), దల్వి సౌమ్య (యూనివర్సిటీ ఆఫ్ ముంబయి), బి.చంద్రిక (ఆదికవి నన్నయ యూనివర్సిటీ), 55 కిలోల విభాగంలో మానికం షీన్ (యూనివర్సిటీ ఆఫ్ కాలికట్), యుక్తిక (మంగుళూరు యూనివర్సిటీ), భామనే వైష్ణవి జ్ఞానేశ్వరి (ఆదికవి నన్నయ యూనివర్సిటీ), 59 కిలోల విభాగంలో టీఎం కీర్తన (యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్), ఎం.దీపనయోమి (ఆదికవి నన్నయ యూనివర్సిటీ), లిజా కంసా (యోగి వేమన యూనివర్సిటీ) మొదటి మూడు స్థానాలలో నిలిచి బహుమతులు అందుకున్నారు. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారుల మనోభావాలు ఇలా..

ఇదే మొదటి సారి..



సౌత్ జోన్ పోటీల్లో పాల్గొనడం ఇదే మొదటిసారి. ఈ పోటీలలో 10వ ర్యాంకు సాధించాను. ఇక్కడకు రావడం ద్వారా జాతీయ స్థాయిలో హిమాచల్‌ప్రదేశ్‌లో ఫిబ్రవరిలో జరిగే పోటీలకు ఎంపికయ్యాను. మరింత ప్రతిభ చాటేందుకు కృషి చేస్తా.

–దివ్య, తక్షశిల యూనివర్సిటీ, తమిళనాడు

రెట్టింపు ఉత్సాహంతో..



ఇటువంటి పోటీల్లో రెట్టింపు ఉత్సాహంతో పాల్గొంటున్నా. గెలుపునకు అవసరమైన మెలకువలు తెలుస్తున్నాయి. ఈ పోటీలలో సిల్వర్ మెడల్ వచ్చింది. నేషనల్ గేమ్స్‌లో బ్రాంజ్, జోన్ లెవెల్‌లో సిల్వర్ మెడల్స్ సాధించాను.

–మోహినీదీప, ఏలూరు

బంగారు పతకం సాధించా..



తమిళనాడు నాగర్‌కోయిల్‌లో జరిగిన పోటీలలో సిల్వర్ మెడల్, యూపీలో జరిగిన పోటీలలో బ్రాంజ్ మెడల్ అందుకున్నాను. 'నన్నయ'లో జరుగుతున్న పోటీల్లో ఇంటర్‌జామ్‌లో గోల్డ్ మెడల్ సొంతం చేసుకున్నాను.

–బైరెడ్డి రాజేశ్వరి, విజయనగరం

టాలెంట్ అవసరం



జాతీయ స్థాయి పోటీలలో రాణించాలంటే చాలా టాలెంట్ ఉండాలి. ఆల్ ఇండియా స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించాను. ఐదు నేషనల్ మెడల్స్ ఉన్నాయి. ఇప్పటి వరకూ 15 చోట్ల జరిగిన వివిధ పోటీల్లో పాల్గొన్నా. మా కోచ్ మంచి శిక్షణ ఇస్తున్నారు.

–డి.గణేష్, ఉస్మానియా యూనివర్సిటీ, తెలంగాణ

థర్డ్ ప్లేస్‌లో నిలిచా..



ఈ పోటీలలో గోల్డ్ మెడల్ అందుకోవాలనుకున్నా. కానీ థర్డ్ ప్లేస్‌లో నిలిచి, బ్రాంజ్ మెడల్‌ను సొంతం చేసుకున్నా. చాలా ఆనందంగా ఉంది. ఇక్కడ ఏర్పాట్లు కూడా బాగున్నాయి. ఇప్పటి వరకూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాను.

–మహాది బాలసువోడ్, సావిత్రీభాయ్‌పూలే యూనివర్సిటీ, పూణే

నిరంతర సాధన



ఇటువంటి పోటీల్లో ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే ఎంతో కృషి అవసరం. ముఖ్యంగా వెయిట్ లిఫ్టింగ్‌లో నిరంతరం సాధన ఉంటేనే విజయాన్ని అందుకోగలుగుతాం. ఈ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నాను.

–రాజేంద్ర వైసాయే, శివాజీ యూనివర్సిటీ, కొల్హాపూర్, మహారాష్ట్ర